గురుసామి లాంటి యెంతోమంది బ్రతుకుతూవుండి
జారి పడిపోతున్న ఆ 'జర్రె' యేమిటి?

# జర్రె

'మహేంద్ర'

అర్జునుడూ, గురుసామి మేకలు తోలుకుని డొంకదారిగుండా బొంతలగుట్ట నెక్కుతున్నారు. బొంతలగుట్ట నావరించివున్న ప్రకృతి సమస్తం నిశ్శబ్దంగా వుంది. ఎండ నిర్దయగా కాస్తూవుంది.

అర్జునుడు వొకబండ చివరికివచ్చి టీగల కోనలోకి చూపు సారించాడు. ఎండ కొట్టకుండా ఎడమచేయి నుదురు కానించుకొని కుడిచేతి చూపుడువేలుతో తనుచూపు మేరనంతా గాలిలో గిరిగీసి చూపుతూ—

"ఏంవిఎండ కాస్తావుందో సూడు. మూగి ఎండ. నిరుడు చిత్తి, వొయ్యాసి నెలల్లో కాసిన ఎండ యిప్పుడే కానేస్తావుంది. ఏ దేగానీ కాకి ఐనా నీడ ఎలబారుతావుందేమో సూడరా'' అన్నాడు.

"నీకూ, నాకూ దప్పితే అవిటికేం గాచ్చారం వచ్చింది యిట్లాటి ఎండలో దిరిగి సచ్చేవానికి. ఊరిముందర చింత మాకుల్లో, టెంకాయి సెట్లల్లో కూసోని ఈ మిద్దెకల్లా, ఆ మిద్దెకలా గుడారప్పతా వుంటే సాలు - పొద్దు పొయ్యేకాడికి వొక్కొక్కటి బొంతగద్ద మాదిరి బలిసి పోతావుంటాయి. దీపాలు బెత్తారనంగా ఊరి నాలుగుసుట్లా అరిటిరంపు ఏం సెప్ప తరంగాదు" అన్నాడు గురుసామి.


అర్జునుడు ముతక గాడాతో కుట్టిన బనీను తొడుక్కొని వున్నాడు నాలుగు మూళ్ళపంచను గోచీ మాదిరిగా కట్టుకున్నాడు అతని తలపాగా మాసి గోధుమ రంగు వుంది. అతని చంకకు ఒక చిక్కం ఒక పాత మిలట్రీ వాటర్ బాటిల్ వ్రేలాడుతూ వున్నాయి. చిక్కంలో రెండు ముద్దల సంగటి, రొండిలో అర కట్ట బీడీలు, అగ్గిపెట్టె సున్నపుకాయా వున్నాయి చేతిలో పొడవైన కొంకిదోటి వుంది పళ్ళు ఎర్రగా గారకట్టి వున్నాయి. ముఖం ముడతలు దేరి వుంది.

అతడు నిలుచున్న బండక్రిందనే గురుసామి నిలుచుకొని వున్నాడు. బలిష్ఠమైన దేహం. నల్లని ఛాయ వయస్సు యిరవై మించదు. వేసుకొన్న చొక్కా మోకాళ్ళ వరకూ వ్యాపించి కట్టుకొన్న పంచను కన్పించనీయడం లేదు వీపులో చొక్కా పర్రలు పర్రలుగా చీలివుంది. మెడవరకు పెరిగిన జుట్టును ఆముదం రాసి వెనక్కు దువ్వుకొని వున్నాడు చిక్కంలో రెండు న్నరముద్ద సంగటి అంటవేసిన చొక్కా జేబులో నాలుగైదు బీడీలు, అగ్గిపెట్టె, కరుకూ వున్నాయి

గురుసామి చెవిలోనుంచీ సగం కాలిన బీడీని తీసి వెలిగించుకొని. అగ్గిపుల్లను ప్రక్కనున్న బోదపైకి విసిరేశాడు బోద భగ్గున మండుకుంది టీగల కోన నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ పన్నెండుగంటల ప్యాసింజరు అరగంట లేటుగా పోతూ వుంది. సరిగ్గా ఆ సమయానికి వారు గుండాల మిట్టదగ్గర బొంతలగుట్ట నధిరోహించి నాగపట్ల కనుమలోకి దిగసాగారు

"మిడికాళ్ళు తొక్కతా రాక పోతే ముందుకు పొయ్యి జీవాల్ని అదిలిస్తే ఏమిరా? కోనలో కాచ్చింది నువ్వు మనిషి తోడుబెట్టుకోని షికారు తిరగనా? మంగలోడి దోనెకాడ కూచ్చోని రెండు జావులు సంగటి దినేవానికి తప్పించి నెలనాళ్ళగా నయాపైసా పని ఏమిసేస్తావుండావు నీవు. మీ నాయన గూడా వుండె! కోనలో కాస్తే రెండు కాళ్ళు ఒక సోట పెట్టేవోడుగాదు. కూత ఏసినాడంటే ఇట్ల మొగరల కోన మొదులుకోని అట్ల నేరేడుమాను సెలమ దాకా-యిట్ల గుండలమిట్ట కాన్నించి అట్ల నక్కలబండ దాకా ఏడున్న జీవాలూ అరచనంలో చుట్టూరా చేరిపోయేటివి. తోడేళ్ళు, పెదనక్కలూ మీ నాయనకు ఉచ్చ బోసుకునేటివి.., మల్లా జెప్తావుండా పెద్ద నక్కొకటి జేరుంటాది. అదో ఆ నల్ల మేక ముందర పోతావుందే ఎర్రమరక. అంతమాత్రము బాగా బలిసుండాది. దాని తోక మాత్రము నా మూరతో ఒకటిన్నర మూర వుంటాది. ముక్కుకాన్నించి వెనికాళ్ళదాకా నల్లంగా బట్లుబట్లుగా వుంటాది. మొన్న నాగులుగాడి చుక్కల మేకను మింగేసింది. అవునట్టా దాన్ని అలగ్గా గొంతు కొరికేస్తాది. బద్దరం!

సంక్రాంతి కథల పోటీలో
రూ. 1500/- మొదటి
బహుమతి పొందిన కథ



బద్దరం! ఒళ్ళులో బయిం పెట్టుకోని మేపుకున్నావంటే ఈ పొద్దు ఒక వుడ్డ జీవాలు రేపు రెండు వుడ్లవుతాయి. ఈ మాదిరిగా చిక్కాంకల్లా, పొద్దుకల్లా జూసుకుంటావున్నావంటే దినానికి ఒకటి లెక్కన ఆ బట్లదానికి వలారం వెళ్ళేసి నాక్కోవి బోతావు...." నాలుకతో నోరు చుట్టూ చుట్టి నములుతున్న వక్కాకును తుపుక్కున వుమ్మేశాడు అర్జునుడు.

"ఆ ఎర్రపిల్ల అంత వుంపదరటావు. అవుగొడ్డు అట్టావాన్ని గొంతు కొరికేస్తాదంటా వుండావు ఏం నువ్వు జెప్పేది? ఏమీ నమ్మేటట్టిదిగా వుండ్లే...." అర్జునుడి వైపు అనుమానంగా చూశాడు గురుసామి.

"ఒరినీ, నీ వొయిసంతా కలిపితే నేను ఈ నాగపట్ల కనమలో తిరిగిన సర్వీసులో సగం వుంటుందా? అప్పటికి నీకు నేను జల్లి చెప్తావుండా ననుకుంటా వుంటావా? పెద్ద నక్కంటే నువ్వు మీ అటకమీద దిరిగే నల్ల పిల్లి అనుకోనుండావా? మమలా గోడలకింద దిరిగే ఊరకుక్క అనుకోనుండావా? పెద్ద నక్కకుండే నేకు కుందేలికి లేదు. కుర్రపందికీ లేదు. అవి కంప సెట్లల్లో ఆవులుపొయ్యే దారుల్లో మంచి బలమైన చెట్టు మొద్దుల్ని తోకతో వదేసి పట్టుకోని ఏం తెలియంది మాదిరిగా దాంకోని వుంటాది. గొడ్డు ఆ దోవను రాంగానే ఎనికాల్లు ఏసేస్తాది. ఎప్పుడైతే ఆవు ముందరకీడస్తాదో బాగా ఈడవనిచ్చి కాలు యిడిప్పిచ్చేస్తాది. ఆ దెబ్బతో ఆవు యిసరకబొయ్యపడిపోతాది. అంతే ఇది దానిమీదపడి గొంతు కొరికేస్తాది.... అయితే నవ్వేమీ దానికి బయపడబండ్లే. అదంటే నీకెంతబయమో దానికినువ్వంటే అంతకంత భయము. నక్క దగ్గరగా బెదరద్దు. బెదిర్తే అది మనిసిమీదనే దూకేను. కత్తితో మారినావంటే ఆ పక్క రెండు మైళ్ళు అయిపుండదు .." ధైర్యం జెప్పుతూ నవ్వసాగాడు అర్జునుడు.

గురుసామి కణతలమీద జారిన ఆము దాన్ని తుడుచుకుంటూ తన ఎత్తు పళ్ళనీ కన్పించేట్టుగా నవ్వాడు.

నడుస్తూవున్న గురుసామి ఉత్తరంగా కోనలోకి చూపు సారించి చటుక్కున నిల్చిపోయాడు

"ఏం రా! కరెంటు కొట్టేసినట్టుగా మాను అయిపోయినావు. ఏమి కనపడతా వుంది నీకు యిచిత్తరం" అర్జునుడు గురుసామి చూస్తున్నవైపు చూపు సారించాడు. పచ్చని చెట్లనడుమ ఒక స్త్రీ వడివడిగా నడచిపోతూవుంది ఆమె కట్టుకున్న ఎర్రచీర ఎక్కడున్నా ఆమెను ఎత్తి చూపుతోంది.

"ఏమి ఆడవాన్నెపుడూ సూడ్లె దిగుదిగు మేకలకూ నాకూ సుదా నోరెండు

కొని బోతావుండాది" అర్జునుడు గురుసామిని దాటుకుని ముందుకు వెళ్ళసాగాడు.

"ఎవురామనిసి. దినామూ యిదే యాళకు నావవదాటుకోని బోతావుండాది" లేని అనాసక్తతను గొంతులో ధ్వనింప జేశాడు గురుసామి.

"దానిది మొగవపల్లె. దాని మొగుడు నీ మాదిరిగా నా మాదిరిగా నీళ్ళు దాగే వోడుగాదు. వానికి పొద్దువుడ్తే కల్లంగడి వానితో రగడ. పొద్దుబోతే పెళ్ళాంతో రగడ. ఈ మనిసి మాత్తరం బతే మానాస్తురాలు. దినామూ కట్టెలు కొట్టుకోని బండ్లో తిరపతి కేసుకోని బోతావుండాది."

"ఓజవే. కట్టెమోపు బండ్లో తిరపతి కేసుకోని బొయ్యేదంటే సిన్నపనిగాదు. వాచర్ కాన్నించి. పారెస్టర్ కాన్నించి. రైలుబాట్లో గాంగివాని కాన్నించి టేసన్లో పాయింట్ మేన్, స్టేసన్ మేస్త్రి. టీసీ. గారుడ్డు. డ్రయివరు. పోలీసోడు.... ఒకరుగాదు. ఎందరి దగ్గర వాదుక్కోని బోవాల. ఇంతా చేసిపోతే అదేందో నొక్కతంట వాడు స్టేసన్ మేస్త్రికూడా బయపడేటోడుగాదంట వాడు ఏడున్న కట్లుబెరికి తిరపతి టేసన్లో ఏలమేపిస్తాదంట! ఇట్టాంటి పోటుకు బదేదానికి ఎవిరికిజెల్లు? అరవమాలోల్లకి జెల్లు అట్టాడిది రైతులింట్లో పుట్టిన ఆడమనిసి నిబ్బరించుకోని వస్తావుందంటే అది సిన్నపని గాదు" తెల్లటికళ్ళను మరింతగా తెరచి మెచ్చుకోలుగా అన్నాడు గురుసామి. అతడు ఆమె కనుచూపు దాటిపోయేటంత వరకూ అలా చూస్తూనే వున్నాడు.

మేకలు కొండవాగును సమీపించాయి అవి గట్టుపై వరుసగా నిలబడి చల్లటి కొండవాగు నీళ్ళు తాగసాగాయి. అర్జునుడూ, గురుసామి ముఖమూ, కాళ్ళూ కడుగుకొని కానుగచెట్ల నీడలో సేద తీరారు. వెలిమేటి ఎవ్వడి. మేకల అరుపులు తప్పించి కోనంతా నిరామయంగా వుంది.

వారిద్దరూ అరచేతిలో తీంట్రటి ఆకుల విస్తరిలో సంగటి పెట్టుకుని ఆవురావురుమంటూ మింగసాగారు. ఎక్కడినుంచో రెండు కాకులు వచ్చి వారి ప్రక్కన వాలాయి. అవి కావ్ కావ్ అంటూ కర్ణకఠోరంగా అరవసాగాయి. అర్జునుడు పదేపదే వాటిని ఛీదరించుకోసాగాడు. మేకలు చెవులూ, తోకలూ కదిలిస్తూ చెట్ల నీడల్లో నిశ్చలంగా నిలబడి వున్నాయి.

భోజనం చేసి వారు కడుపునిండా నీరు త్రాగి త్రేన్ మంటూ తేన్చారు. అర్జునుడు వక్కాకు దంచి నోటిలో వేసుకొని నమల సాగాడు. గురుసామి బీడీ తాగుతూ సాలోచనగా అర్జునుడి వైపు చూశాడు.

"ఏవిరా గురుసామీ నీమాదిరిగా కాళ్లా సాంచేస్తే నాకు జరగద్దా? నాలుగు కట్టెపేళ్ళు చీల్చకబొయ్యి ఊరిముందర నిలబెడ్తే నాలుగో అయిదో వస్తాది. రాత్రికి బత్తెం జరగతాది. నేను అగ్గో ఆ పెంటలోకి బొయ్యి నాలుగు పిగర ముక్కలు కొట్టకొస్తా. నువ్వు మాత్తరం నా జీవాల్ని గూడ అట్ట అదిలిస్తావుండు ఏమారినావో మెకం. సమ్మకంగా ఏదోవొక పిల్లను సమికేస్తుంది. పొయ్యినాక నోరు కొట్టుకోని ఫలము లేదురా" అంటూ పదేపదే జాగ్రత్త జెప్పి పొదల్లోకిదూరి పెంటలోకి మాయమయ్యాడు.

* * *

గురుసామి మేకలు తోలుకుని మంగలోడి దోనెవైపు సాగ బారాడు. నడుస్తూ అతడు మాటిమాటికీ కలియజూడసాగాడు. ఆకులు సరసరమని కదిలిన చోటల్లా అతడు చూపు నిలుపుతున్నాడు. మేకలు





సంక్రాంతికి స్వాగత గీత —ఫొటో : శ్రీనగేష్, చీరాల

టపటపా ఎండుటాకుల్ని తొక్కుతున్నప్పుడల్లా అతడు కంగారుపడిపోతున్నాడు.

"దానితోకే నా మూరతో వొకటిన్నర మూరకు తక్కువుండను."

'అవుగొడ్డట్టాదాన్ని అలగ్గా ఎత్తేస్తాది'

'దానికుండే నేకు కుంపెలికీ లేను కుర్రపండికీ లేదు' అప్పనుడి మాటలు అతని చెవుల్లో గింగిర్లుతిరుగుతున్నాయి అతడు తానొక సాహసయాత్ర చేస్తున్న అనుభూతిని పొందుతున్నాడు. ఏ క్షణాన్నైనా మాయదారిమృగం మేకపిల్లపై పడవచ్చునని అతడు పదే పదే పరాకు చెప్పుకోసాగాడు.

ఇంతలో జెముడుపొదల్లో ఏదో జరజర కదిలినట్లయింది. తర్వాత సీకి చెట్లల్లో ఏదో సర సర ప్రాకినట్టయింది. ఉండి వుండీ బలమైన శ్వాస వినిపించసాగింది. సవ్వడి ప్రక్కనున్న గుబుర్లలోకి జరిగినట్టయింది.

గురుసామి చేతిలోని మచ్చు కత్తిని బిగించాడు అతని ముఖం జేవురించి వుంది అతడు ఊపిరి బిగించివున్నాడు. శరీరం యావత్తూ బిర్ర బిగుసుకు పోగా అతడు అతి జాగ్రత్తగా నడవసాగాడు. పెద్దగా అరుస్తూ నల్ల మేకొకటి గురుసామి కాళ్ళ కడ్డం బడుతూ అవలికి పారిపోయింది అతడు ప్రక్కనున్న దేవదారు చెట్టు మొదల్లో నిలబడి నలువైపులా పరిశీలనగా చూడసాగాడు.

ఇంతలో అతనికి రెండు గజాల దూరంలో ఏదో ధభిల్లున పడింది. గురుసామి నిర్ఘాంతపడి చెట్టుపైకి చూశాడు.

ఒక గంట క్రితం నేరేడు మాను చెలమ దగ్గర వాగు దాటుతూ వుండిన



**సంగ్రహ పరిచయం :**

పూర్తిపేరు : మధురాంతకం మహేంద్ర.
వయస్సు : 22 సంవత్సరాలు.
ప్రస్తుత నివాసం : కొటాల, చిత్తూరుజిల్లా.
చదువు : తిరుపతి శ్రీ వేంకటేశ్వరా యూనివర్సిటీనుంచి భౌతిక శాస్త్రంలో ఎం యెస్సీ

నా మొదటి కథ "కనిపించని కోయిల" భారతిలో ప్రచురించబడింది కొన్ని కవితలు భారతిలోను, ఆంధ్రజ్యోతి దిన, వార పత్రికల్లోను ప్రచురించబడ్డాయి

నా కథ "జర్తె"కు బహుమతి యిచ్చినందుకు "ఆంధ్రజ్యోతి"కి కృతజ్ఞతలు.

—యం. మహేంద్ర

ఎర్రచీర ధరించిన స్త్రీ సివంగివలె కొమ్మనుంచి కొమ్మకు ఎగబ్రాకుతూ వుంది.

ఆమె గురుసామికేసి నిశ్చలంగా జూస్తూ వుంది. ఏదో మాట్లాడదానికన్నట్టుగా నోరు మెదిలించి. నోటిలోని వక్కాకును వుమియడానికి యిష్టపడనిదానిమల్లే ముఖం తిప్పుకుని ప్రక్కనున్న ఎండు కొమ్మను కత్తితో కొట్టసాగింది. వేటు వేటుకూ కొమ్మ పేళ్ళు పేళ్ళుగా లేస్తోంది.

తానున్నది నిర్జనారణ్యం అన్న ఉదాసీనత వల్ల గాబోలు ఆమె తన వస్త్రధారణపై అతి తక్కువ శ్రద్ధ వహించినట్టుంది. ఆమె కటుకున్న చీర మొలచుట్టూ బిగిసి చిన్న కచ్చడంలా వుంది ఆమె నల్లగా. ఎగకొచ్చిన ఎనుములా నిగనిగ లాడుతూ వుంది ఆమె చెట్టు తమరలో కాసిన పనసపండులా కొమ్మమీద భారంగా కూర్చొనివుంది. ప్రవాహానికి అడ్డంగావేసిన యిసుకమేట అంతకంతకూ ప్రిదిలిపోతున్నట్టుగా ఆమె రైక అసహాయంగా వుంది ఆమె అడవిలో మృగతుల్యుడై తిరుగుతున్న మానవుల్ని కటాక్షించడానికి దేవదారు కొమ్మపై వెలసిన ఆదిశక్తిలా వుంది.

గురుసామి అచేతనుడై ఆమెకేసి చూడసాగాడు. కొమ్మవిరిగి క్రింద పడటంతో ఆమె వెనుదిరిగి క్రిందికి దిగసాగింది. గురుసామికి వుండి వుండీ మేకలు అరుస్తున్న అరుపులు వినిపించడం లేదు ఆమె దిగుతూనే వక్కాకు వుమ్మేసి వగరుస్తూ చెట్టుబోదె నానుకొని చేరగిలపడిపోయింది.

రెండునిముషాలు గడిచాయి. గుడిముందు నిలుచున్న నందిలా గురుసామి శిలాసదృశంగా నిలబడే వున్నాడు

చివరికామె తెప్పరిల్లి నోరు తెరచింది. ఆమె పెదవులు ఎండి అక్కడక్కడా ఎర్రగా చీలివున్నాయి దోపుడోయిన విగ్రహానికిమల్లే ఆమె ముక్కూ. చెవులూ బోసిగా వున్నాయి ఆమె మెడలోని బొట్టు దారం నల్లగా మాసి నామమాత్రంగా తెగిపోవడానికి సిద్ధంగా వుంది.

"ఏమి ఎండ కాస్తా వుందో సూడు. దరిద్రపు ఎండ. లీదాబిక్కు. కూలీ నాలీ ఈ వడకు బతికి బట్ట కట్టేట్టుగా లేము. మాయదారి ఎండ- దీనికి దూము తగల్నాని" శపిస్తున్నట్టుగా అంది.

శాపం తగిలిన రాక్షసుని హాహాకారంలా ఎక్కడో స్టేషన్లో రైలు భీకరంగా కూతవేసి ఆగింది.

"ఏమి జేసి సచ్చేది. ఈ బండికి పోదామని ఆ కాడికీ తెల్లారిజామున ఎలబారొచ్చినా. ఎర్రికాలవనుంచీ నక్కలబండ దాకా అరవోళ్ళ అడివి అడివంతా బీడు-

జేసేపినారు. కడసారికి కలబందలు మిగి లించేటట్టు లేరు యెదవ నాబట్లు...." ఛీత్కారంగా విదిలించేస్తూ లేచి ఆమె కొమ్మకున్న ఆకులు చెలగి మోపు కట్ట సాగింది.

తరవాత ఆమె గురుసామికేసి పరిశీల నగా చూస్తూ "అర్జున్‌రెడ్డితో సదా పోతా వున్న వాడివిగదా నువ్వు" అంటూ నవ్వి తల వంకిస్తూ "బద్రం- పెద్ద నక్క తిర గతా వుండాది మద్దేనం బండిపోకముందు గుండాలమిట్ట మొదట్లో దిగవ పెంట్లోకి పోతావునింది." అంటూ లేచి స్వగతంగా. "యిట్టాటిది యింకొక మోపన్నా కావాల" అనుకుంది. మోపును నెత్తిమీద పెట్టుకొని ఆమె పశ్చిమ దిక్కుగా అడవి లోకి నడవసాగింది.

ఆమె అలా కట్టెను మోపుకట్టుకుని తన ముందు నుంచీ వెళ్ళిపోవడం తన సర్వ స్వాన్నీ దోచుకపోయినంతగా విలవిల లాడిపోయాడు గురుసామి. అడుగు తీసి అడుగు వేస్తున్నప్పుడు కదులుతున్న ఆమె కండల్ని. నగుస్తున్నప్పుడు హాయలుగా కదులుతున్న ఆమె నడుమునూ తమకంతో చూడసాగాడు గురుసామి. అతడలా చూస్తూ వుండగానే ఆమె చెట్ల మధ్య మాయమయ్యింది.

అనంతరం అతడు మంత్రముగ్ధునివలె ఆమె పోయిన దిక్కుగా నడవసాగాడు. వెనుదిరిగి జూడకుండా ఆమె నడిచీ నడిచీ ఒక బాగి చెట్టు దగ్గర ఆగింది. నేలమీద కందుతున్న కొమ్మను కత్తితో నరక సాగింది.

గురుసామి మెల్లగా వెళ్ళి ఏమాత్రం వెనిక్కి తిరిగినా తనకు తగిలేటట్టుగా బాగా దగ్గరగా ఆమెవెనుకగానిలుచున్నాడు. అతడి శరీరం కంపిస్తూవుంది. అతడిశ్వాస బలంగా వుంది.

ఆమె సడ్రున వెనుదిరిగి జూసింది.

ఆ హఠాత్పరిణామాన్ని ఎదుర్కోవ డానికి ఆమెకు మరికొన్ని క్షణాలు పట్టింది. క్రమంగా ఆమె కళ్ళల్లో ఎర్రజీరలు వ్యాపించాయి. ఆమె పెదవులు వొంకర్లు బోయాయి. ఆమె ముక్కుపుటాలు అదురుతున్నాయి.

"ఎట్టుండావి వొళ్ళు. మీది మీది కొస్తా వుండావు. నాతో పెట్టుకోవద్దు. మొదులే నానోరు మంచిదిగాదు...." తీవ్రమైన కోపం. కించిత్ భయమూ మిళితంకాగా. అంది.

గురుసామి వంక అనుమానంగానూ. క్రోధంగానూ చూస్తూ మోపుకట్టుకో సాగింది.

"అర్జునుడు మొన్న జెప్పినాడులే నీ దయిన్నంగురించి.మనిషితోడులేంది మొగ దల కోనలో నుంచీ యింటికాడికి పోలేని బోడివి. ఆడదానిమీదికిఎగబడతావుండావు గదరా!" అని మోపు కదిలించి. అది బరువుగా తోచడంతో. "ఇట్ట అగ్గిబడి ఈ మోపు కొంచెం నెత్తిమీది కెత్తుదువురా! గూబమాదిరి మళ్ళ జూద్దువుగావి" అంది.

గురుసామి మోపును ఆమె తలమీది కెత్తాడు. అలా ఎత్తడంలో అతని ముఖం నడుమ్రుకింద ఆమె చీరను రాచుకుని. పొత్తికడుపు మీదినుంచీ గుండెల మధ్యగా లేచి. ముందుకు వాలి ఆమె చెంపను సుతా రంగా రాసుకుంటూ పోవడం పూర్తిగా యాదృచ్ఛికం గాదు.

అప్పుడామె "ఊఁ. ఊఁ" అంటూ తత్తరపడడం నెత్తిమీదికొచ్చేస్తున్న అవాంఛనీయమైన పరిస్థితిని ఎదుర్కోవ డాని కన్నట్టుగా వుంది.

మోపు నెత్తికెత్తుతూనే ఆమె గిరుక్కున తిరిగి నడిచిపోసాగింది. ఆమె పడగ దించుకొని పుట్టలోకి పోతున్న పాములా అడవిలోకి వెళ్ళి అదృశ్యమైంది. మలు పుల్లో ఆమె తనకేసి భయం భయంగా చూడడం గుర్తించాడు గురుసామి. ఆ చూపు పులి పంజాను తప్పించుకొన్న జింక చూపులా వుంది. నక్క నోరు దప్పిన మేకపిల్ల చూపులా వుంది.

గురుసామి మళ్ళీ కొంత సేపు అచేత నంగా నిలబడిపోయాడు. 'మోపునెత్తి తలమీద పెట్టుకోలేని ఆడది తనను ఎంత మాట అనింది' గురుసామి ముఖం జేవు రించింది. 'ఏమయినా దీన్నిపొద్దు వాది




## ప్రొఫెసర్ ఆర్. చంద్రశేఖర్ MBMC

మెజీషియన్, & హిప్నటిస్ట్

తెనాలిలో ఒక సాంస్కృతిక సభలో పెద్ద పెద్ద మీసాలతో మాయలఫకీరు వేషంలో ఓ మెజీషియన్ గంటసేపు చక్కని మాజిక్‌లతో వినోదం. ఆశ్చర్యం కలిగించి. ఇంటర్వెల్ తరువాత మామూ లుగా వచ్చి మరోగంట హిప్నటిజం ప్రదర్శించి ప్రేక్షకులను ఆశ్చర్యంలో ముంచాడు. ఏ విద్య కావిద్యలోనె ఆరి తేరిన వాడిలాగ ప్రదర్శించిన ఆ కళా కారుడే ప్రొఫెసర్ చంద్రశేఖర్. తెనాలి తాలుకా. పెదపూడి గ్రామ నివాసి.

తెనాలి ఆర్. టి.సి. లో పని చేస్తూ ఖాళీ సమయాల్లో ఈ ప్రదర్శనలను హాబీగాచేస్తున్న చంద్రశేఖర్ చిన్నతనం నుంచీ ప్రొఫెసర్ సర్కార్‌ను ఆదర్శంగా పెట్టుకుని ఈ విద్యను సాధనచేశారు. అంతేకాక యోగశక్తిలో కూడా ప్రవేశం ఉంది. గుండెవేగం తగ్గించడంతోపాటు కొన్ని నిమిషాలు ఆపగలరు. హిప్న టిజం ద్వారా తలనొప్పి. కీళ్ళ నొప్పి. నిద్రలేమి. తాగుడులాంటి వాటిని నయం చేసి మంచి పేరు సంపాదించుకున్నారు.

ఈయన మాజిక్ ప్రదర్శనలో యెదు రుగా వున్న వారి మనసులో నిది చెప్పడం. చుట్టని మిఠాయిగా చేయడం. నీళ్ళను పాలుగా చేయడంలాంటి చిత్ర మైన అంశాలు యెన్నోవున్నాయి. మాజి



క్కి మంచి భవిష్యత్తు వుందని నమ్మే వారిలో ముఖ్యుడు చంద్రశేఖర్.

చిరునామా: పెదపూడి. తెనాలి తాలూకా. గుంటూరు జిల్లా.

—బి. వి. పట్టాభిరామ్
మెజీషియన్



పాష్యలక్ష్మని చిత్రించె ప్రతి గృహమ్ము —ఫొటో : శ్రీనగేష్, చీరాల

లేదిలేదు' గురుసామి మళ్ళి ఆమె వెంట బడ్డాడు.

ముందూ వెనుకగా వారలా కొంతసేపు నడిచారు ఆమె గబగబా నిలవకుండా అతని చేతికందకుండా దాదాపు పరుగు లాంటి నడకలో నడచి పోతూనే వుంది.


"ఛత్ చేతికందినది తప్పించుకొనింది గదా" పదేపదే ఖేదపడుతూ వేగం హెచ్చించసాగాడు గురుసామి ఆమె 'చెంగులు గాడి జర్తె"ను సమీపిస్తోంది.

గుండాల మిట్టనుంచీ మంగలోడి దోనె వైపు వెళ్ళే కొండదారి చెంగులుగాడి జర్తెను చుట్టిపోతుంది. దాదాపు ఇరవై గజాలున్న ఆ జారుడు బండను మామూలుగా ఎవరూ దాటడం జరగదు. అడవిలో కాచే కొంటెకోణంగి పశువుల కాపర్లు కూడా. ఆ సాహసానికి ఒడిగట్టరు. ఎప్పుడో ఓబికాలంలో "చెంగులుగాడు" అనబడేవాడు జర్తెను దాటుతూ జారి క్రింద నున్న జెముడుచెట్లమీద పడి చనిపోవడంతో దానికా పేరు వచ్చిందని చెప్పుకొంటారు.

యధాలావంగా ఆమె జర్తెను చుట్టివచ్చే దారి వెంబడి నడవసాగింది. ఒక క్షణం ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చినవాడికి మల్లే గురుసామి జర్తెను దిగసాగాడు నున్నగా, పట్టుదప్పితే పదిబారల క్రిందికి జారేట్లుగా వున్న ఆ బండను అతడు జాగ్రత్తగా దిగుతున్నాడు నల్లగా, నున్నగా మెరుస్తూవున్న ఆమె దేహకాంతి అతన్ని అనుక్షణం పూరిస్తూ వుంది. అంతలో ఆమె తననొక వాజమ్మను జేసి తప్పించుకోవడం అతణ్ని క్రోధోన్మత్తున్ని చేస్తోంది

అతడు ఆ వాలును క్రూరపందిలా ఒడుపుగా దిగుతున్నాడు. గుంతనక్కలా ఒంగి ఒంగి దిగుతున్నాడు. రెక్కను కాలుతో వెనగ్గా ఈడ్చి పట్టుకుని పెట్టను వెంటాడడానికి దబ్బను చుట్టి వస్తున్న కోడి పుంజులా దిగుతున్నాడు.

చిట్టచివరకు ఎలాగైతేనేం అతడు ఆ జారుడు బండను జయప్రదంగా దిగేశాడు. దారి ప్రక్కగా చెట్టుమాటున నిలుచున్నాడు పెదనక్క తోకతో చెట్టును చుట్టుకున్నట్టుగా అతడు ఎడమచేతితో చెట్టు బోదెను కౌగలించుకొని నిలుచునివున్నాడు ఊపిరి బిగపట్టి చెవులు రిక్కించి అతడు ఎదురు చూడసాగాడు. అతని కళ్ళు




చురుగ్గా పని జేస్తున్నాయి

చెట్టు వెనుక ఆకుల గలగల.

ఎక్కడో మేకలు అరుస్తున్నాయి.

గూబ గుయ్యిమనేట్టుగా కీచురాళ్ళరొద.

మొగచల ంటలో ఎవరో కట్టెలు కొడుతున్న శబ్దం గురుసామి కాలాన్ని ఉచ్ఛ్వాస నిశ్వాసాల్తో కొలుస్తున్నాడు

రెండు పిట్టలు ఒకటి వేరొకదాన్ని తరుముతుండగా పెద్ద రభస చేస్తూ కొమ్మల మధ్య ఎగిరిపోయాయి గురుసామి చెవులు రిక్కించి కళ్ళు మిటకరించి. పళ్ళు గిట కరచి. ఊపిరి బిగపట్టి కాళ్ళతో వేర్లు తన్నుకొని అప్రమత్తుడై వున్నాడు.

బలంగా గసపోస్తూ మనిషి వస్తున్నట్లయింది తల వోరగా వాల్చిచూశాడు గురుసామి వేసవిలో సైతం ఎర్రగా చిగిర్చిన చెట్టులా ఆమె దొంక దిగివస్తూ వుంది.

మరికొన్ని సెకండ్లు గడిచాయి దగ్గరకు వస్తూనే చిరుతలా ఆమెపైకి లంఘించాడు గురుసామి. ఆమె తలమీది కట్టెల మోపు పట్టు దప్పి విరుసుకబోయి పడిపోయింది

సరిగ్గా అదే సమయానికి పెదనక్క గురుసామి వదిలేసివచ్చిన మేకల్లో అర్జునుడి మేకను వాడుపుగా పట్టి గొంతు కొరికి కోనలోకి ఈడ్చుకొనిపోతూవుంది. మిగిలిన మేకలు గుంతాల మిట్టదగ్గరజేరి కాపరిజాడ కానక బేలగా అరుస్తున్నాయి.

మరో పదినిముషాలు గడిచాయి.

తుమ్మమొద్దులా తనమీద పడున్న గురుసామిని ప్రక్కకు దోసి ఆమె అతికష్టం మీద లేచి నిలబడింది. ఆమె నీళ్ళు నిండిన కళ్ళతో గురుసామివంక అసహాయంగా జూస్తూవుంది. గురుసామి భయం భయంగా ఆమెకేసి చూస్తున్నాడు. ఆమె పదేపదే నిట్టూరుస్తూ మరికొంత సేపు అలాగే కూలబడిపోయింది. తర్వాత లేచి ముడులు విడిన మోపును బిగించింది. నర్రున ముక్కు చీది కొంగుతో కళ్ళు, ముక్కు తుడుచుకొంది. కొంగుతో చుట్టజేసి నెత్తి మీద పెట్టుకొంది. శరీరం వణికిపోతుండగా చేతుల బలవంతాన ఆమె మోపు నెత్తి తలమీద పెట్టుకొంది. పెట్టుకొంటున్నప్పుడు ఆమె మేను బండరాయి పడ్డ తీవెలా కంపించిపోయింది ఒకక్షణం ఆమె మోపును తన మీదే వేసుకొని పడిపోతుందేమోననిపించింది కాళ్ళు ఒకదానొకటి అడ్డం పడుతుండగా గురుసామి ఆమె వంక అచేతనంగా చూస్తూ వుండగానే చెట్లమధ్య మాయమయ్యింది

తాను ఎంత సేపలా నిర్వీర్యంగా పడి వున్నాడో గురుసామికి తెలియదు తర్వాత



జయప్రకాశ భవన్‌లో ఇటీవల ముఖ్యమంత్రి శ్రీ అంజయ్య కుమార్తె వివాహ సందర్భంలో సాంస్కృతిక కార్యక్రమాలను యిచ్చిన డాక్టర్ నేరెళ్ళ వేణుమాధవ్, శ్రీమతి ఎం. ఎస్ సుబ్బలక్ష్మి లను ముఖ్యమంత్రి దంపతులు సన్మానించిన దృశ్యం

అతడు లేచి లేని గాంభీర్యం తెచ్చుకుని బొంగురు గొంతుతో 'ట్ర్‌ర్, చ్చెచ్చెచ్చె' అంటూ రకరకాల శబ్దాలు చేస్తూ మేకలకు తన వునికిని తెలియపరుస్తూ గుండాలమిట్ట వైపు నడవసాగాడు. దూరంగా మేకలు అరవడం విన్పిస్తోంది. దాదాపు ఆరు గంటల ప్రాంతంలో గురుసామి మేకలను కలుసుకొన్నాడు. గబగబా అతడు తన మేకలన్నీ వున్నదీ లేనిదీ చూసి తృప్తిగా ఊపిరి పీల్చుకొన్నాడు. కానీ అర్జునుడూ, అతని మేకలూ కన్పించక పోవడంతో అతని ముఖంలో భయాందోళనలు అలుముకున్నాయి అతను మేకలనదిలిస్తూ నూరు రాళ్ళత్రోవన బొంతల గుట్ట దిగసాగాడు. మేకలు పింటికలు వేస్తూ ఒకదాన్నొకటి రాచుకుంటూ, అరచుకుంటూ దిగుతున్నాయి.


* * *

"ఈ పొద్దు మానానికి ఈ యిరవదాకా పళ్ళు దోమలా. వాడు పెద్ద బొండమానాల నామీద పడేటాళకు నాకు కళ్ళు బూసులు కమ్మేసినాయి ఏమాత్తరం నాకు వొళ్ళులో పట్టువుండినా వాడు నా మోకాలి మీది ఎంటిక పెరికేబోడేనా...." గొంతు కూచొని హృదయ విదారకంగా విలపిస్తూ వుంది ఎల్లమ్మ.

"గొమ్ముడు సెలే! వాడు రానీ. నా కొడుకు ఈ పొద్దు వాడు జేసిందానికి వాన్ని నేను మున్ను దినిపించకపోతే నా పేరు అర్జునుడేగాదు. ఐద్రం రా పోయినాక నోరుకొట్టుకొని లాభవు లేదురా అని నేను పిలక్కు జెప్పినట్టుగా జెప్పేసిపోతే-వీడు-ఈ సింగిరి పింగిరోడు-నా మేకను నక్క నోట్లో ఏసేసి- నిన్ను-ఆడదాన్ని పరాయి మొగోడు కట్టుకున్నెదాన్ని తెల్లారినుంచీ సద్దినీళ్ళు నోట్లో పొయ్యకుండా కడుపాత్తరం కోసం కానరాని కోనలోకొచ్చి కట్టెలు కొట్టుకునేదాన్ని- ఈమాదిరిగా పాపం పోసుకున్నేడుగందా! రానీనాయాలు వాడ్ని ఈపొద్దు ఏం జేస్తానో సూడు...." అర్జునుడు పేట్రేగిపోతున్నాడు.

"వీడి మూలంగా గాకపోతే ఈయాళకు నేను ఊర్లోవుండునా! ఈ ఎదవ నాకొడుకు మూలంగా గాకపోతే నేనీపొద్దు ఈ ఫారెస్టోని సేతికి చిక్కుదునా? బంగారట్టా మేక — అద్వానం ఇన్నూరుకు తక్కువపోని మేక — కోస్తే పదారు వీశెలకు తక్కువ పడని మేక— వీనిమూలంగా గాకపోతే నక్కనోట్లో ఏసేద్దునా. ఈ ఫారెస్టోడు జీవానికి ఎనిమిది లెక్కన నలబై జీవాలుకూ మున్నూటయిరవై కడ్తానా. లేదా అంటావుండాడు ఏడ





తెచ్చికద్దు ? తూ త్తెరీ, ఈ పొద్దు రానీ వోడు వాని సన్నాసన్నా కీళ్ళు యిరి సెయ్యకపోతే నేను సచ్చికాలవ ఎంకట రెడికే పుట్టినోన్నుగాదు...." అర్జునుడు కోపంతో ఊగిపోసాగాడు.

బొంతలగుట్ట పాగం వద్ద, ఫారెస్టు డిపార్టుమెంటు వారు నాటిన సరిహద్దు రాయివద్ద వారిద్దరూ ముడుచుకొని కూర్చొని తమ గోడు వెళ్ళబోసుకుంటున్నారు. అనతి దూరంలోనే కానుగమాను క్రింద అర్జునుడి మేకలు వుద్ద తోలబడి వున్నాయి. ఇద్దరి కట్టెల మోపులూ చెట్టు బోదెకు ఆనించబడివున్నాయి. గార్డు మేకల నదిలిస్తూ ప్రక్కనున్న స్క్వాడు మెంబర్లతో మాట్లాడుతున్నాడు.


సివిల్ డ్రస్సులోనున్న స్క్వాడు మెంబర్లూ, వారి హెడ్డూ, రేంజరూ ప్రక్కనున్న చదునుబండమీద కూర్చొని కొండను ఎగజూస్తున్నారు. మరికొందరు అడవిలో పసువులకాపర్లు తెలివి మీరుతున్న వైనాన్ని, వన సంపదను ధ్వంసం చేస్తున్న తీరునూ, కట్టెలవాళ్ళు మోపులను టవున్లో అమ్ముకుంటున్న వెలల్ని గురించి కర్కశంగా మాట్లాడుకుంటున్నారు.

పడమట పొద్దు వాలుతోంది. చీకటి మబ్బులు ఆకాశాన్ని ఆక్రమించుకోవడం మొదలు బెట్టాయి. ఇంతలో స్క్వాడులో నుంచీ ఒకడు అర్జునుడి దగ్గరగా వచ్చి "ఐతే ఏందియా నువ్వు జెప్పేది ?" అని కనుబొమలు యెగరేస్తూ నిలదీయసాగాడు.

అర్జునుడు లేచి చేతులు కట్టుకొని "నేనేమి జెప్పేనాను దేవరా. మిమ్మల్నని ఏవి పుణ్ణెం. ఈ పొద్దు నాటయిం బాగలే మేపి మేపి బంగరట్టా మేక్కు నీళ్ళొదిలేసి కడుపు కాలి వచ్చినోన్ని. ఈ మంద తప్పించి ఊర్లో సెంటుబూమి లేనోన్ని. సేతిలో రూపాయి కాసు లేనోన్ని. ఇంట్లో మట్టి పెంకులు తప్పించి సత్తుబోకి లేనోడిని.... అప్పిటికీ నా శక్త్యానుసారం జీవానికి అర్ధ రూపాయి లెక్కన నెలకు పచ్చైదు రూపాయలు గార్డోనికి కడ్తావుండా. మీకు మేము కొత్తగా జెప్పేది ఏముండాది. సూసుకోని ఏసుకోండి" అర్జునుడు పట్టుకమల్లాడుతున్నాడు.

"తెల్లారి నుంచీ నోట్లో పచ్చిమంచి నీళ్ళు బొయ్యలేదు సామి. ఈ పొద్దుటికి వొదిలెయి." ఎల్లమ్మ గింజుకోసాగింది.

"ప్రతి రోజూ పొయ్యి టవున్లో ఇరవై గ్గా ముప్పైగా అమ్ముకుంటాను. ఈ పొద్దు రేంజరింట్లో శుభకార్యానికి ఒక మోపు యిచ్చేదానికి ఏందో ఊరికే యిచ్చినట్టు మూలగతా వుండాను. ఆయన సూసీ సూడకుండా పోబట్టి మీరు కూడా వొకబతుగ్గా బతగతావుండారు. సరిపోయింది. మీ న్యాయం మీకే సరిపోయింది గదా" ఎకసెక్కంగా మాట్లాడుతూ విసవిసగా అతడు దూరంగా నడచిపోయాడు.



సంక్రాంతి ముగ్గు

— ఆర్. పద్మావతి, మద్రాసు

"రేంజరు ప్రక్కనున్న గార్డుతో "ఏమయ్యా ఎంత సేపయ్యింది నువ్వు వాచ్ మేన్‌ను తోడిచ్చి యిర్లవాళ్ళని పంపి. వాళ్ళింకా రాలేదు యింకా గోట్స్ వస్తాయంటా వుండావు ఈ పొద్దే వచ్చేస్తాయంటావా. 'టుమారో ఆఫ్టర్ నూన్' వట్టునా." అంటూ గదిరించాడు

"వస్తాను సార్. అదిగో ఆ బండ క్రింద మేకలు దిగుతున్నాయి చూడండి యిర్లోళ్లు గూడా వచ్చేస్తారు. యిర్లవానిది విరుగుడులేని గురి అంటారండి. గంటకు ముందే టుపాకీ శబ్దం మీరే విన్నారుగదా కుందేలో. వందో లేకుండా వారు కొండ దిగితే అడగండి" అన్నాడు గార్డు.

వారలా చూస్తూ వుండగానే మేకల అరుపులు దగ్గరబడ్డాయి.

"అయిగో అవి గురుసామి మేకలే. రానీ నా కొడుకు. కుశాలగా వస్తా వుండాడు ఈడ యముడు వచ్చి కూసోనుండే సంగతి తెల్లే రానీ ఈ పొద్దు ...." అర్జునుడు లేచి లేచి కూర్చోసాగాడు.

ఇర్లవాళ్ళు వేటను పెద్ద కొమ్మకు కట్టి తెస్తున్నట్లున్నారు వెనుకగా ఇద్దరు ముగ్గురు కట్టెలవాళ్ళూ, వారి వెనుకగా వాచ్ మేన్ వస్తున్నారు.

'కణితి' కాదు 'అడవిపంది' 'రానీండి చూద్దాం' 'ఎంత పందెం' అంటూ స్క్వాడు మెంబర్లు నోళ్ళు వూరించుకోసాగారు. ఇర్లవాళ్ళు దగ్గరికొచ్చి బరువు దించారు. గురుసామి మేకలు అర్జునుడి మేకలతో కుశలప్రశ్నలు వేస్తున్నాయి.

"ఎవడు వీడు ?" రేంజరు కట్టెకు కట్టి తెచ్చిన మనిషి కాయం జూస్తూ ప్రశ్నించాడు.

"బతికే వుండాడా" అంటూ గార్డువంగి పరిశీలనగా చూసి పెదవి విరిచాడు

ఇర్లవాడు "వీడు గురుసామని ఈ పేటలో వుండేవాడే సామీ. చెంగులుగాడి జర్రెకాడ కుందేలిని కాలిస్తిని పొదల్లోకి ఎతకతాబోతే ఈడు గోరస్తా వుండాడు. ఈ కట్టెలోళ్ళుగూడా ఆడ్నే వున్నారు" అన్నాడు

"అవును సామి, ఎప్పుడు పడినాదో ఏమో మూలగతావుంటే మేము పోయి సూస్తిమి. ఆయిరవకు వీడు మన లోకంలోనే వుండె. 'ఏవిరా పాపాత్మా ఎందుకు దాటినావురా జర్రిని' అంటిమి. "కింద ఫారెస్టోళ్ళని జూసి బయపడి కోనలోకి దాటుకుందామనుకొంటినిరా" అని కళ్ళనీళ్ళు యిడిచేసినాడు" కట్టెలవాళ్ళు నీళ్ళు ఉబుకుతుండగా అన్నారు.

అక్కడున్న మనుషులందరూ శవం చుట్టూ చేరిపోయారు, అర్జునుడు కాయాన్ని పరిశీలనగా చూసి ముఖంలో రంగులు మారుతుండగా తల దగ్గర కూర్చొని "ఫారెస్టోళ్ళకి బయపడి జర్రె దాటి సచ్చినావుగదరా. జీవానికి పాలుమారి యిరగపడి సచ్చినావుగదరా" అంటూ విలపించసాగేడు.

"సత్తెపమాణెంగా వీడు జర్రె పడి సచ్చినాడు దేవరా. నా టుపాకీ దెబ్బకు గాదు. కావాలంటే గుడ్డలూడ పెరికి సూడండి. దెబ్బ తగిలుంటే నన్నుకూడా కొరత వెయ్యండి" అంటూ యిర్లవాడు రేంజరు కాళ్ళ దగ్గర కూలబడ్డాడు.

నల్లటి కొండ కొమ్ము పైనున్న తెల్లని జర్రె మేకపిల్లను వెంటాడుతున్న పెద్ద నక్కలా క్రూరంగా, ఎల్లమ్మను వెంటాడుతున్న గురుసామిలా ఉన్మత్తంగా అడవిలో కెళితేగానీ భుక్తిగడవని పశువుల కాపర్ల దగ్గర కట్టెలవాళ్ళ దగ్గర దొరికినకాడికి డబ్బులు గుంజడంకోసం మాటువేసివున్న ఫారెస్టు ఉద్యోగుల కండాలా నిర్దయగా, ఒకరినొకరు వేటాడుకొనే పరిస్థితిని కల్పిస్తున్న సమాజపు భయంకర గహ్వరంనుంచి వ్రేలాడుతున్న విషపునాలికలా, కొండ క్రింద జరుగుతున్న తతంగాన్ని చూస్తూనే వుంది.

* జర్రె— జారుడు బండ. జర్రెలమీది నుంచి పశువులు, మనుషులు జారిపడడం- చనిపోవడం తరచూ అడవుల్లో జరిగే విషయం.